ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం 30 నవంబరు 2024
www.prajaaswaramdaily.com
2 pm



### సీఎం రేవంత్ ను కలిసిన ఆస్ట్రియ రాయబారి

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆస్ట్రియా రాయబారి కేథరినా వేజర్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికల పట్ల ఆస్ట్రియా రాయబారి ఆసక్తి కనబరిచారు.

## ఇది నంబర్ కాదు..

# రైతుల నమ్మకం

### 54 వేల కోట్ల రూపాయలతో రైతుల జీవితాల్లో పండుగ తెచ్చాం

### సీఎం రేవంత్ రెడ్డి

### మీ సంతోషంలో పాలుపంచుకోవడానికి పాలమూరుకు వస్తున్నా అని పోస్టులో వెల్లడి



హైదరాబాద్ : ఏడాది క్రితం సరిగ్గా ఇదే రోజు.. పొలానికి వెళ్లి అరక కట్టాల్సిన రైతు పోలింగ్ బూతుకు వెళ్లి "మార్పు" కోసం ఓటేశాడని సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. మహబూబ్ నగర్ లో రైతు పండుగ కార్యక్రమానికి బయలుదేరుతున్నట్లు తెలిపారు. ఆ మేరకు ఆ ఓటు అభయహస్తమై రైతన్న చరిత్రను తిరగరాసిందని అన్నారు. ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ, రూ.7,625 కోట్ల రైతు భరోసా, ధాన్యానికి క్వింటాల్ కు రూ.500 బోనస్, రూ.10,444 కోట్ల ఉచిత విద్యుత్, రూ.1433 కోట్ల రైతుబీమా, రూ.95 కోట్ల పంట నష్ట పరిహారం, రూ.10,547 కోట్ల ధాన్యం కొనుగోళ్లు .. ఒక్క ఏడాదిలో.. 54 వేల కోట్ల రూపాయలతో రైతుల జీవితాల్లో పండుగ తెచ్చాం. ఇది నెంబర్ కాదు..రైతులు మాపై పెట్టుకున్న నమ్మకం అని అన్నారు. ఈ సంతోష సమయంలో అన్నదాతలతో కలిసి రైతు పండుగలో పాలు పంచుకోవడానికి ఉమ్మడి పాలమూరుకు వస్తున్నా అని పోస్టు చేశారు సీఎం రేవంత్.

## టీజీపీఎస్సీ కొత్త చైర్మన్‌గా

# బుర్రా వెంకటేశం

హైదరాబాద్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం నియమితులయ్యారు. ఈ నియామకాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శనివారం ఆమోదించారు. ప్రస్తుత చైర్మన్ ఎం. మహేందర్ రెడ్డి పదవీ కాలం డిసెంబర్ 3తో ముగియనుంది. అందుకే కొత్త చైర్మన్ నియామకానికి ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 20 వరకు దరఖాస్తులు స్వీకరించగా, 45 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. వారిలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, వివిధ వర్సిటీల ప్రొఫెసర్లు కూడా ఉన్నారు. చివరికి బుర్రా వెంకటేశం పేరును సీఎం ఎంపిక చేసి, నియామక ఫైల్‌ను గవర్నర్‌కు పంపగా ఆయన ఆమోదించారు. ఇక బుర్రా వెంకటేశం 1968 ఏప్రిల్ 10న తెలంగాణలోని జనగామ జిల్లాలో జన్మించారు. 1995 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన... రాజ్‌భవన్ సెక్రటరీ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా పని చేశారు. ఆయన ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సర్వేల్ గురుకుల పాఠశాలలో చదువుకున్నారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులు కలెక్టర్ అయ్యారంటూ బుర్రా వెంకటేశం గురించి పలు వేదికలపై ప్రస్తావించారు.

### ఆయన నియామకాన్ని ఆమోదించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

### 1995 బ్యాచ్ ఐఏఎస్ అధికారి

### రాజ్‌భవన్ సెక్రటరీ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా పనిచేసిన అనుభవం

### డిసెంబర్ 3తో ముగియనున్న ప్రస్తుత చైర్మన్ మహేందర్ రెడ్డి పదవీ కాలం



# కులాలవారీగా.. ఉపాధి

### కులగణన ఉద్దేశం ఇదే

### పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కు

### ద్వితీయ, తృతీయశ్రేణి నగరాల్లోనూ పరిశ్రమలు

### మంత్రి : శ్రీధర్‌బాబు

**హైదరాబాద్: బలహీన వర్గాలకు చెందిన పారిశ్రామిక వేత్తల కోసం బిక్కి ఏర్పాటు అభినందనీయమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బ్యాక్‌వర్డ్ క్లాసెస్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆధ్వర్యంలో టీహబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు.**

తమ ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతోందన్నారు. అత్యుత్తమ ఎంఎస్ఎంఈ పాలసీ తీసుకొచ్చామన్నారు. విధానాలను ఆచరణలో పెట్టడమే పెద్ద సవాల్ అని అన్నారు. సమ్మిళిత అభివృద్ధి కోసమే మా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.. 50 శాతానికి పైగా



ఉన్న బీసీ జనాభాకు అనుగుణంగా కార్యక్రమాలుండాలేనేది ప్రభుత్వ అభిమతమన్నారు. ఉపాధి కులాలవారీగా అందాలనే ఉద్దేశంతో కులగణన చేస్తున్నాన్నారు. ఎన్ని సవాళ్లు వచ్చినా అధిగమిస్తున్నాన్నారు. సవరణ అవసరం అయితే చట్టాల మార్పు కోసం కేంద్రం సాయం తీసుకుంటామన్నారు. బిక్కి ప్రతిపాదనలకు అనుగుణంగా పారిశ్రామిక విధానాల్లో మార్పులు తీసుకొస్తామన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు, ప్రభుత్వ శాఖల నుంచి ఎలాంటి సమస్యలు రాకుండా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని వెల్లడించారు. వెనుకబడిన వర్గాల పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. ద్వితీయ, తృతీయశ్రేణి నగరాల్లోనూ పరిశ్రమలు విస్తరించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

## అమెరికాలో ఖమ్మం వాసి మృతి

అమెరికాలోని చికాగోలో విషాదం చోటుచేసుకుంది. గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో ఖమ్మం జిల్లాకు చెందిన సాయితేజ అనే యువకుడు మృతి చెందాడు. ఖమ్మం నగరం రాపర్తి నగర్ రమణ గుట్ట రోడ్డులో ఉంటున్న... 26ఏళ్ల నూకరపు సాయితేజ ఎం.ఎస్ చదవేందుకు 4 నెలల క్రితం అమెరికా వెళ్లాడు. సూపర్ మార్కెట్ లో పార్ట్ టైమ్ విధులు నిర్వహిస్తూ చదువుకుంటున్నాడు. విధులు ముగించుకుని వస్తున్న సాయితేజపై.... దుండగులు కాల్పులు జరిపారు. సాయితేజ మృతితో ఖమ్మం నగరంలోని అతని నివాసంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## పులి పంజా

ఆదిలాబాద్ జిల్లా : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సిర్పూర్ టి మండలం దుబ్బగూడ గ్రామంలో పులి దాడి చేసింది. కంది చేలో పనులు చేస్తున్న ఓ రైతు సురేష్ పై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పులుల వరుస దాడులపై రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

## సురేఖ మంత్రి పదవిలో ఉండే

# అర్హత లేదు

### మహిళలపై ఆరోపణలకు కేసు పెట్టాలని కోర్టు ఆదేశం

### బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్: మహిళలపై ఆమె చేసిన ఆరోపణలకు కేసు పెట్టాలని కోర్టు చెప్పిందని, ఆమెకు మంత్రి పదవిలో ఉండే అర్హత లేదని, తెలంగాణ ప్రజలు గతంలోనే కొండా సురేఖను తిరస్కరించారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్‌అధ్యక్షుడు కేటీఆర్ ..గురుకుల బాట అనే కార్యక్రమం చేపట్టారని తెలిపారు. గురుకుల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకే ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "గురుకుల బాట అని చెప్పగానే కాంగ్రెస్‌కు భయం పుట్టింది. గతంలో ఐపీఎస్ అధికారిగా ఉన్న తనకు కేంద్ర ప్రభుత్వం అవార్డు ఇచ్చిందన్నారు. ఏడేళ్ల సర్వీస్‌ను వదిలేసి విద్యార్థుల కోసం రాజకీయాల్లోకి వచ్చానన్నారు. తనపై ఆరోపణలుంటే బయటపెట్టండన్నారు. వాటికి ఆధారాలుంటే సీబీఐ విచారణకు ఇవ్వండని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు.

